

# పోర

రామా చంద్రమౌళి

మధూకర్ మనసు నీటిపై తేలుతున్న కాగితపు పడవలా ఎంతో తేలిగ్గా, హాయిగా ఉంది

అప్పుడే సర్వర్ తెచ్చిపెట్టిన వేడి టీని కొద్దిగా చప్పరించాడు

అతని తలలో ,... నిన్నటి...,

యింటర్ యూనివర్సిటీస్ ఫుట్‌బాల్ పోటీల్లో... తను కాప్టన్‌గా ఉండి... మెరుపులా ఉరుకుతూ ఆడుతూంటే—

ఆ చప్పట్లు... ఆ ఈలలు... ప్రేక్షకులనుండి ఉరకలేస్తూ పొంగే ఆ ఉత్సాహం - ఓహ్ ...,

తను గెలిస్తే—

ఎందరు తనను వాళ్ళ భుజాలపై కెక్కించుకున్నారని... ఎవరెవరో వచ్చి తనను అభినందించారు. ఎందరో కరచాలనం చేశారు ఎందరో ఎన్నెన్నో రకాలుగా—

అసలు తన జట్టు గెలవడానికి తనే కారణమన్నారు

ఎన్ని పొగడ్తలు... ఎన్ని ప్రశంసలు... ఎన్ని శుభాకాంక్షలు... ఓహ్ ఆ క్షణం... ఎంత మధురంగా ఉంది.

పేపర్లవాళ్ళు ప్రత్యేకంగా అడిగి తన ఫోటో తీసుకున్నారు... రేపటి పత్రికలో...చివరి పేజీలో కెప్టెన్ మధూకర్ అని... తన ఫోటో—

యింకా లోతుగా ఆలోచించలేక పోయాడతను అప్పటికే ఏడులక్షల రూపాయల లాట్రీ వచ్చినట్టుగా ఫీలై గబగబా వేడి టీ నంతా కొట్టేశాడు

కప్పును టేబిల్ పై పెడుతూ ఎదురుగా చూస్తే_అతననెవరో అప్పుడే జైల్లో నుండి పారిపోయొచ్చిన మనిషిలా ఉండి తనవంకే తీక్షణంగా... శిలలా చూస్తున్నాడు.

ఎందుకలా చూస్తున్నాడు—

ప్స్... ఎందుకో

సిగరెట్టు వెలిగించుకుని టైం చూచుకున్నాడు

రాత్రి పన్నెండూ నలభై

గిరాకీ లేని హోటల్ నిశ్శబ్దంగా ఉన్న సానికొంపలా ఉంది "కౌంటర్‌లోని మనిషి పుట్టిన నాటినుండీ నిద్రపోనట్టు చాలా గంభీరంగా కునికిపాట్లు పడుతున్నాడు

యివ్వాల్టితో కాలేజీ బిపోయి- యిహ రేపటినుండి సెలవులు... తను తనూరి కెళ్ళిపోయి... రేపటి పేపర్లోని తన ఫోటోని నాన్నకు చూపించి... అబ్బ ఆ క్షణాల్లో—

ప్చ్... యింకా ముప్పావు గంటుంది బండికి

మళ్ళీ తలెత్తాడు. వాచీ చూచి...ఎదురుగా ఆ మనిషి... యింకా అలాగే చూస్తూ తనటు చూడగానే చూపులు త్రిప్పుకుని చేతిలోని దినపత్రికను విప్పుకుని—

వీని మొహానికి ఓ పేపరు కూడానా చేతిలో.

కొత్తగానే ఉంది పేపరు... రేపటిది కాదుగదా... యిప్పటికే మార్కెట్‌లోకి వచ్చి ఉంటుందా...వాన్నడిగి చూస్తేనో తన ఫోటో—

వాడినా అడిగేది . వాని కుక్క మొగమూ వాడూ.

కావలిస్తే అసలు తను తన ఫోటోనూ చూచుకోకుండానైనా ఊరుకుంటాడు గాని వాడినిమాత్రం అడుగడు-దట్సాల్.

ఎందుకు.

ఎందుకో అలా అనిపిస్తోంది వాన్ని చూస్తూంటే- అంతే

సిగరెట్టు అలా పూర్తవుతూండగా ఎదురుగా కూర్చున్నవాడు మధూకర్‌నూ అతని వెంబడున్న సూట్‌కేస్‌నూ పదే పదే తిరగేసిచూచి చరచరా వెళ్ళిపోయాడు బయటికి

యింకో పావుగంటసేపు గడిపి మళ్ళీ ఓసారి గడియారం చూచుకుని బిల్లు చెల్లించి సూట్‌కేస్‌తో సహా బయటికొచ్చాడు మధూకర్.

బయట రోడ్డుమీద జనం లేనేలేదు. ఫుట్‌పాత్ ప్రక్కగా ఓ టాక్సీఆగిఉంది. దాని దగ్గరే ఓ ముగ్గురు నిలబడి తన వంకే చూస్తున్నారు...

అప్పటినుండీ తన ఎదురుగా కూర్చుని చూచిన మనిషీ... యింకో యిద్దరు అలాంటి ఉక్కు మనుషులే—

ఎందుకు వాళ్ళలా చూస్తున్నట్టు తన దిక్కు—

"ఏయ్ మిస్టర్—యిట్రా"అన్నాడు అందులోనుండి ఒకడు.

ఎవరిని - తననేనా.

చుట్టూ చూశాడు ఎవరూ లేరు దాపులో... అంటే తననే

మెల్లగా నడిచాడు కారు దగ్గరికి

యింకా తీక్షణంగా చూస్తున్నారు దగ్గరికొచ్చిన దయ్యాన్నో, దేవున్నో చూస్తున్నట్లు

"ఈ కారెక్కు..."

"ఎందుకు..."

"ఎక్కంటున్నాను—" జేబులో నుండి కత్తి తీశాడు.

"........."

"నీకేం ఫరవాలేదు, నిన్నేంచేయం కూచో—" డోర్ తెరిచాడు

భూమి పుండులోకి దిగిపోతున్నట్లని పిస్తోంది మధూకర్‌కు చెమటలు పడుతున్నాయి ఎక్కి కూర్చున్నాడు కారు బాణంలా దూసుకుపోయింది

"ఎందుకు నన్ను " ఏదో అనబోయాడు

"షటప్..."

ఏమిటిది వీళ్ళెవరు. ఎందుకు తననిలా తీసుకుపోతున్నారు— తన దగ్గర డబ్బూలేదు తను ఆడదీకాదు

"ఆ ఊరిపేరేమిట్రా—" డ్రైవ్ చేస్తున్న వాడడిగాడు యింకొకడ్ని

"కూనూరు నువ్వు పోనీ నాకు తెలుసా ఊరు. ఊఁ లెఫ్ట్—"

జానపద సినిమాలు ఏకదాటిగా జ్ఞాపకమొస్తున్నాయి మధూకర్‌కు... అతనికంతా పిచ్చి పిచ్చిగా ఉంది

ఓ అరగంట తర్వాత కారు ఓ చిన్న ఊరును చేరుకుంది

రోడ్డువారగా బోర్డ్— 'కూనూరు' అని

ఊళ్ళోకి వెళ్ళింతర్వాత ఖండా దగ్గర చుట్ట తాగుతూ కూర్చున్న ఎవడో కావలి మనిషి ముందర సర్రున కారాపి హఠల గొట్టి— "యిక్కడ రావూరు ఎంకయ్యిల్లేది" అన్నాడు డ్రైవింగ్ సీట్లోని మనిషి

రావూరు ఎంకయ్యెవడు— మధూకర్ మెదడు తిమ్మిరెక్కుతోంది

"గదేంది దొర...గా పచ్చబంగళ"

కారు పక్షిలా పరుగెత్తి ఆగింది, బంగ్లా ముందర

ఒకడుగబగబాదిగి బజర్ నొక్కాడు రెండు నిముషాల తర్వాత ఎవరో వచ్చారు లోపల్నుండి

"ఎంకయ్యగారున్నారా?"

"ఆఁ..."

"రమ్మను"

వచ్చిన మనిషి లోపలికెళ్ళిపోయాడు వెనక్కు తిరిగి

తర్వాత ఎవరో మీసాల మనిషివస్తే "మీవాడ్ని తీసుకొచ్చామండీ వెంకయ్యగారూ - వెంటనే మీరు ప్రకటించినట్టుగా వెయ్యి రూపాయలిప్పించండి—"

"మావాడేనా... ఏడీ—"

"రండి... కార్లో కూర్చున్నాడు"

వెంకయ్య ఎవరూ... అతని వాడెవడూ... ప్రకటనేమిటీ... వెయ్యి రూపాయలేమిటీ — డ్రైవర్ సీట్లో ఉన్న పేపరును అందుకుని గబగబా విప్పాడు మధూకర్

చివరి పేజీలో—

ఫుట్‌బాల్ ఛాంపియన్ అన్న హెడింగ్ క్రింద ఎవని ఫోటోనో పడి— దాని ప్రక్కనే "కనబడుటలేదు" ప్రకటనలో తన ఫోటో...

ఆ పరిస్థితిలోనూ మధూకర్‌కు ఆగనంత నవ్వొచ్చింది.

---